# మార్పు

**బి.వి. సుభాషిణి**




హాస్పిటల్‌లో రౌండ్స్‌కి వెళ్తున్న నాకు రిసెప్షన్ కౌంటర్ దగ్గర కొంచెం గలాభాగా, కలగాపులగంగా ఏదో సందడిగా మాటలు వినిపిస్తున్నాయి. లోపలకి వస్తున్న నర్స్‌ని పిలిచి- ''ఏం జరుగుతోంది అక్కడ?'' అని సిస్టర్‌ని అడిగాను.

''ఏం లేదు సర్, విలేజి నుంచి వచ్చిన పేషంట్ తాలూకావాళ్ళు పేషంట్‌ని అడ్మిట్ చేసుకోవాలని అడిగారు. ఐదు వేలైనా ఇస్తేగాని ఇక్కడ అడ్మిట్ చేసుకోరని చెప్పాము. వాళ్ళు ముందు అడ్మిట్ చేసుకోండి. తర్వాత డబ్బు మావాళ్ళు తెచ్చికడతారు అని చెప్పారు. ఇక్కడ అలా వీలుకాదు. వేరే హాస్పిటల్‌కి వెళ్ళండి అని గట్టిగా చెప్పాక వెళ్ళిపోయారు సర్!'' అని చెప్పింది.

ఇది ఇక్కడ మామూలే. మంచి సమయం. ఎందుకంటే నా భార్య శుభ ఆ సమయంలో లేదు. తను వుండివుంటే ఏదో ఒక వాదన చేస్తుంది. చేర్చుకోవాల్సిందే అని పట్టుబడ్తుంది. వేరే హాస్పిటల్‌కి వెళ్ళేలోగా ఏదైనా జరిగితే? అని ప్రశ్నిస్తుంది. డబ్బు మళ్ళీ తెచ్చికడతారు కదా అంటుంది. తనకి డబ్బు విలువ తెలీదు అని నా అభిప్రాయం. కలవారింట పెరిగిన ఆమెకి డబ్బు లేకపోతే వచ్చే ఇబ్బందులు తెలీవు అంటాను. కానీ తను ఒప్పుకోదు. కొంచెం మానవత్వంతో ఆలోచించండి అంటుంది. ఎవరో ఒకరో ఇద్దరో కట్టకపోయినంత మాత్రాన నష్టమేమిటి అంటుంది.

నేను చిన్నప్పట్నించి ఎన్నో కష్టాలుపడి స్కాలర్‌షిప్స్ సాయంతో చదివి ఈ స్థాయికి వచ్చాను. నా తెలివి, చురుకుదనం చూసి చదువుకునే రోజుల్లోనే శుభ తనని పెళ్ళిచేసుకోవాలని తనే ముందు ప్రస్తావించింది. అంతస్థుల అంతరంవల్ల తను చెప్పలేకపోయినప్పటికీ ఆమెగా ముందుకు రావటంతో తను ఎంతో సంతోషించి ఆమెని పెళ్ళిచేసుకున్నాడు.

మొదట్లో విడివిడిగా వేర్వేరు హాస్పిటల్స్‌లో డాక్టర్లుగా నాలుగేళ్ళు పనిచేసాక ఇద్దరూ కలిసి ఒక హాస్పిటల్ చిన్నదిగా ప్రారంభించాము. వృత్తిపట్ల శ్రద్ధ, అంకితభావంతో పనిచేస్తూ మంచి హస్తవాసిగల డాక్టర్స్‌గా పేరు తెచ్చుకున్నాము. తమ తర్వాత హాస్పిటల్ పెట్టినవాళ్ళు తమకన్నాముందే పెద్ద పెద్ద హాస్పిటల్స్ నిర్వహించడం చూశాక తను కూడా పెద్ద హాస్పిటల్ నిర్వహించాలని కోరిక, తపన మొదలయ్యాయి. తను సంపాదించినది కొంత, బ్యాంక్ సహాయంతో కొంత, సుధ తండ్రి డబ్బు కొంత అలా అన్నీ కలిపి తన కలల కనుగుణంగా పెద్ద హాస్పిటల్ కట్టారు. మోడరన్ ఎక్విప్‌మెంట్స్, లాబ్ ఫెసిలిటీ, ఎన్నో వసతులతో మొదలుపెట్టాము. గైనకాలజీవార్డు విడిగా శుభ మెయింటెయిన్ చేసేవిధంగా మొదలుపెట్టాము. సిటీలోని పది పెద్ద హాస్పిటల్స్‌లో ఒకటిగా పేరు తెచ్చుకున్నాము. మేమిద్దరమే కాకుండా ఇంకా ఆరుమంది డాక్టర్స్‌ని నియమించాను. అవసరమైనప్పుడు సేవలందించేట్లు ఇంకో నలుగురు డాక్టర్లతో ఒప్పందం చేసుకున్నాము.

ఈ పరిణామాలన్నిటినీ శుభ కూడా ఇష్టంగానే ఆహ్వానించింది. కానీ వీటివల్ల పేషంట్స్‌కి ఎక్కువ భారం పడకూడదు. అవసరమైనవరకే టెస్టులు చేయాలి అని చెప్తుంటుంది. మనం వీలైనంత తక్కువ ఛార్జీకే వైద్యం అందివ్వాలని చెప్తుంది. ఎవరైనా అర్జంటుగా అడ్మిట్ అయ్యే పరిస్థితిలో వుంటే అడ్వాన్స్‌కి పట్టుబట్టకుండా చేర్చుకుంటుంది. కానీ అయిదారుసార్లు పేషంట్లు డబ్బు చెల్లించలేని పరిస్థితి, చనిపోయిన పరిస్థితి, నయంకాని జబ్బుతో డిశ్చార్జి అయ్యేటప్పుడు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. దాని తర్వాత నేను ఖచ్చితంగా అడ్వాన్స్ తీసుకోకుండా అడ్మిట్ చేసుకోకూడదు అని పట్టుబట్టాను. తను వున్నప్పుడు తన మాటే చెల్లుబాటవుతుంది.

మా ఇద్దరికీ వత్తిరీత్యా సమయం సరిపోదు అని భావించి మా ఇద్దరు పిల్లల్ని చెన్నైలో హాస్టల్ వుంచి చదివిస్తున్నాము. బాబు కమల్, పాప తన్వీలతో శెలవులకి వాళ్ళు ఇంటికి వచ్చినప్పుడు సంతోషంగా గడుపుతాము. బాబు మెడిసిన్ ఫస్ట్ ఇయర్, తన్వీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

కమల్ ఫ్రెండ్స్‌తో రూమ్‌లో వుంటూ కాలేజీకి బైక్‌లో వెళ్ళి వస్తూ వుంటాడు. ఒకరోజు కాలేజీకి వెళ్తున్న కమల్, ఎదురుగా వస్తున్న కుక్కని తప్పించబోయి కిందపడ్డాడు. తలకి దెబ్బ తగిలింది. చేయి విరిగింది. ఆ సమయంలో తనకి తెల్సినవారెవరూ పక్కన లేరు. తను ఏమీ మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. కొందరు చూసీ చూడనట్లు వెళ్తున్నారట.

ఎవరో ఒకతను మాత్రం ముందుకు వచ్చి కమల్‌ని లేపి ఆటోలో కూర్చోబెట్టుకుని దగ్గరలోని మంచి హాస్పిటల్‌లో జాయిన్ చేశాడు. వాళ్ళు అడిగిన అడ్వాన్స్ లేదని తన దగ్గర వున్న వెయ్యి రూపాయలు ఇచ్చి మొదట వైద్యం మొదలుపెట్టండి, వాళ్ళవాళ్ళు వచ్చి మీకు పే చేస్తారు అని ప్రాధేయపడ్డాడు. హాస్పిటల్‌లో వైద్యం ప్రారంభించారు. తలకి, చేతికి కట్టుకట్టారు. తర్వాత కొంచెం తేరుకున్నాక కమల్‌ని అడిగి ఫోన్ నంబరు తెల్సుకొని మాకు ఫోన్ చేసి చెప్పి భయపడాల్సిన పనిలేదు. వెంటనే రండి అని చెప్పాడు. తర్వాత మేము అక్కడ వుండే కమల్ ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి హాస్పిటల్ అడ్రస్ చెప్పి కమల్‌ని చూసుకోవాలని చెప్పి మేము బయల్దేరి చెన్నై చేరేసరికి యాక్సిడెంట్ జరిగి పది గంటలయ్యింది.

మేము డాక్టర్స్‌ని కలుసుకుని వారు అంతవరకు చేసిన ట్రీట్‌మెంట్ వివరాలు విన్నాం. కమల్ కొంచెం తేరుకున్నాక డిశ్చార్జి చేసుకుని వెళ్ళవచ్చు అని చెప్పారు. ఆ రోజు కమల్‌ని చేర్పించిన వ్యక్తి వస్తాడేమో అని ఎదురుచూశాము. కానీ రాలేదు. అతనికివ్వవలసిన డబ్బు ఇచ్చేస్తే బాగుండేది. నేరుగా కృతజ్ఞతలు తెలుపుకుంటాము అని అనుకున్నాము. కానీ వీలు కాలేదు. శుభ అప్పుడు చూసిన చూపుల్లో, నాకు మా హాస్పిటల్‌లో కాదుకనుకే మన బిడ్డ కాపాడబడ్డాడు అని అర్థం కనబడినా పట్టనట్లు వుండిపోయాను.


తర్వాత కమల్ ఒక నెలరోజులకి పూర్తిగా కోలు




కున్నాడు. ఇంక తన చదువుకి ఇబ్బంది పడకూడదని చెన్నై వెళ్ళిపోయాడు ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత ఇంకో సంఘటన జరిగింది. నాలోని నిర్లిప్తత, కరడుగట్టిన తత్వాన్ని మార్చిన సంఘటన ఇది.

నేను డ్యూటీలో వున్నప్పుడు హాస్పిటల్ ఆవరణలో ఏడుపులు విన్పించాయి. గొడవ గొడవగా అరుపులు, కేకలు వినవస్తున్నాయి. అంతకు రెండు గంటల ముందు ఒక పేషంట్‌కి తీవ్రమైన షాక్ తగిలి, స్పృహ తప్పిన స్థితిలో తీసుకొని వచ్చారు. ఎంత ప్రాధేయపడ్డా ''అడ్వాన్స్ కడ్తేనే అడ్మిట్ చేసుకుంటాం లేదంటే వేరే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళండి'' అని చెప్పడంతో ఏమీచేయలేని పరిస్థితులలో ఆ పేషంట్స్‌ని వేరే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు. వాళ్ళు అక్కడికి చేరుకుని వైద్యం ప్రారంభించేసరికి ఆలస్యమయి పేషంట్ పల్స్ పడిపోయి చనిపోయాడు. దాంతో ఆగ్రహించిన పేషంట్ తాలూకు బంధువులు, ఆ ఊరి జనాలు ఈ హాస్పిటల్ దగ్గర గొడవకి దిగారు. కొంచెం మానవత్వం, కరుణ చూపించి మీరు ఇక్కడ వైద్యం ప్రారంభించి వుంటే బతికేవాడు. మీ నిర్లక్ష్యం, కాఠిన్యం వల్ల నిండు ప్రాణం బలయింది అని అరవసాగారు. ఆ అరుపుల్లోనే వాళ్ళ ఊరిపేరు వినగానే నాలో కదలిక. వారు చెప్పే ఊరు చేగల్లు. అది నేను పుట్టిన ఊరు. పదిహేనేళ్ళ వయసులో తండ్రి చనిపోయాక ఆ ఊరు వదలి బతుకు తెరువుకోసం సిటీకి వచ్చారు. అక్కడ అన్న, చిన్నాయన సహాయంతో, స్కాలర్‌షిప్‌ల సాయంతో చదివి డాక్టరయ్యాను.

షాక్ తగిలి చనిపోయిన పేషంట్ తల్లిని చూసినప్పుడు ఎక్కడో చూసిన గుర్తు వచ్చింది. ఆమె తెల్లని చెంపపై నల్లని మచ్చ. చూస్తూ వుండగానే ఆమెని గుర్తుపట్టాను. ఆమె తాయారమ్మ. చిన్నప్పుడు తాయారమ్మత్త అని పిలిచేవాళ్ళం. ఇరుగు పొరుగునే వుండటం వల్ల ఆమె పిల్లలు, మేము కలిసి స్కూలుకి వెళ్ళడం ఆడుకోవటం అన్నీ జరిగేవి. ఒకసారి స్కూలు నుంచి వస్తున్న తనని ఎద్దు




కుమ్మి తీవ్రంగానే గాయపడినప్పుడు తన తల్లిదండ్రితో కలసి తనుకూడా పట్నానికి వచ్చింది. అక్కడ తన వైద్యానికి డబ్బు కావాలంటే తల్లి నగలతో తన కమ్మలని కూడా తాకట్టు పెట్టడానికి ఇచ్చి తనకి సమయానికి వైద్యం అందేటట్లు చేసింది. ఇదంతా గుర్తుకు వచ్చేసరికి నాలో గిల్టీ ఫీలింగ్ మొదలయ్యింది. కలిమి లేనివారి హృదయాలలోనే పరోపకారం, దయ, కరుణ వున్నాయి. నాకు ఈ స్థితిలో ఎందుకు ఆ స్పందన లేకుండాపోయింది అని అంతర్మథనం మొదలయ్యింది. స్టాఫ్ ఆ ఊరివారికి సర్దిచెప్పి అతికష్టంతో వెనక్కి పంపేశారు. కానీ చెన్నై సంఘటన, చేగల్లు సంఘటన నాలో మార్పుకి నాంది పలికాయి. తర్వాత నేను హాస్పిటల్‌లో రూల్స్ కొంచెం సడలించాను.

అత్యవసర పరిస్థితిలో వున్నవారికి వైద్యం మొదలుపెట్టండి అని చెప్పాను. ఎప్పుడో నూటికి ఒక కేసు విషయంలో బిల్లు రాబట్టలేని పరిస్థితి ఎదురవుతూ వుంది. కానీ ఇప్పుడు ఆ విషయానికి ప్రాధాన్యత ఇవ్వటం లేదు. లేనివారికి ఇది ఒక సహాయం, అనుకుంటాను. మన నిర్లక్ష్యంవల్ల పేషంట్‌కి వైద్యం ఆలస్యమయి ప్రమాదం జరుగకూడదు అని నర్సులకూ, స్టాఫ్‌కి గట్టిగా ఆదేశాలిచ్చాను. ఈ మార్పు శుభకి కూడా ఆనందదాయకమే. తర్వాత నా స్వంత ఊరిలో కూడా శుభ సహకారంతో చిన్న హాస్పిటల్ కట్టించి ఇద్దరు డాక్టర్లు, వీలైనన్ని సౌకర్యాలతో ప్రారంభించాను. నేను ఆ ఊరివాడినే అని తెల్సిన ఆ గ్రామస్తుల్లో ఎంతో సంతోషం. ఆ ఊరిలో చదువుమొదలుపెట్టి ఇంతవాడినయ్యి తిరిగి ఆ గ్రామానికి సహాయం చేయటం అనేది ఆ గ్రామస్థుల్లో నా వ్యక్తిత్వాన్ని, విలువని, గౌరవాన్ని పెంచింది. ఆ ఊరిపిల్లలకి కూడా నన్ను ఆదర్శంగా చూపిస్తారు. వ్యక్తి ఉన్నత స్థానానికి చేరినా తన ఔన్నత్యాన్ని పదిమందికి చేసే సహాయంతోనే కొలవాలి అని నిరూపించుకునే ప్రయత్నంలోనే వున్నాను. ☆



## కొత్త క్రేజ్!

ఓ వైపు ప్రభుదేవాతో ప్రేమాయణం-పెళ్లి విషయమై ఈమధ్య బాగా పాపులర్ అయిన కేరళ కుట్టి నయనతార మరోసారి వార్తల్లోకి వచ్చింది. బాలకృష్ణ రాముడిగా నటిస్తున్న పౌరాణిక చిత్రం 'శ్రీరామరాజ్యం'లో సీత పాత్రకి ఎంపికైనట్టు సినీవర్గాల భోగట్టా. బాపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సీతగా నయనతార నటిస్తోందీ అంటే జనాలంతా ఆశ్చర్యపోతున్నారు. ఆమధ్య వచ్చిన 'సింహా'లో బాలకృష్ణకి జంటగా నటించిన నయనతార మరోసారి బాలయ్యబాబుకి జోడీగా, అందునా పౌరాణిక పాత్రలో కనిపిస్తోంది.